సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి


ఫిర్యాదు స్వీకరిస్తున్న డీసీ రవి కుమార్

రాజేంద్రనగర్: స్థానిక జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ రవి కుమార్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత శాఖ అధికారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులపై ప్రతివారం రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేసి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్ల ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలని సూచించారు.

నాలుగిళ్లలో చోరీ

మణికొండ: ఇళ్లలో దొంగలు పడి విలువైన బంగారు ఆభరణాలతో పాటు నగదును ఎత్తుకెళ్లిన ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. హైదర్షాకోట్‌తో పాటు శాంతినగర్‌లోని పట్నం రమేశ్, చంద్రారెడ్డి, రాజేశ్, కొమలి కుటుంబ సభ్యులు నివసిస్తున్నారు. శనివారం ఉదయం వివిధ పనుల కోసం ఇంటికి తాళాలు వేసి బయటకు వెళ్లారు. మధ్యాహ్నం వచ్చి చూడగా ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. రమేశ్ ఇంట్లో తులం బంగారం, కొంత నగదు, చంద్రారెడ్డి ఇంట్లో 4 తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, రాజేశ్ ఇంట్లో 10 తులాల బంగారం, కొమలి ఇంట్లో 5 తులాల బంగారాన్ని దొంగలు దోచుకెళ్లారు. బాధితులు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

గచ్చిబౌలి: యువతి అదృశ్యమైన ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన యువతి (19) ఖాజాగూడలో ఉంటున్న సోదరి ఇంటికి 10 రోజుల క్రితం వచ్చింది. ఈనెల 26న మధ్యాహ్నం ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో తెలిసిన చోట్ల వెతికినా ఫలితం లేకుండా పోయింది. అటు స్వగ్రామానికి చేరుకోలేదని తెలియడంతో సోమవారం రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దకుడి చెరువు సుందరీకరణ పనుల పరిశీలన

మియాపూర్: డివిజన్ పరిధిలోని పటేల్ చెరువు, నాయినమ్మ చెరువు, మక్తమహబూబ్ పేటలోని పెద్దకుడి చెరువు సుందరీకరణ పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ మల్లిగావాడ్ ఫౌండేషన్ సభ్యులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువుల్లోని మురుగు నీరు, గుర్రపు డెక్కను తొలగించి మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించి ఆహ్లాద వాతావరణం అందిస్తామన్నారు. అదేవిధంగా చెరువు చుట్టూ కంచెలు ఏర్పాటు చేసి స్థలాలు కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట మల్లిగావాడ్ ఫౌండేషన్ సభ్యులు రామ్, చైతన్య, నాయకులు సుప్రజ, భార్గవ్, కిశోర్, రవి, నాగిరెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త డంపింగ్‌కు చెక్

గోల్కొండ: ప్రభుత్వ పాఠశాల, ఒవైసీ ప్లే గ్రౌండ్, దర్గా లాంటి ప్రదేశం వద్ద చెత్త డంపింగ్‌పై గతంలో 'సాక్షి'పత్రికలో వచ్చిన వార్తలకు ఎట్టకేలకు బల్దియా అధికారులు స్పందించారు. పాఠశాలలకు వచ్చే విద్యార్థులు, ప్లే గ్రౌండ్‌కు వచ్చే క్రీడాకారులు ఈ చెత్త కుప్పలను దాటి వెళ్లాల్సి వచ్చేది. ఎన్నిమార్లు హెచ్చరించినా స్థానికులు లెక్క చేయకుండా చెత్తను స్కూల్ ప్రహరీ వద్దే డంప్ చేసేవారు. దీనిపై గోల్కొండ వార్డు కార్యాలయ సిబ్బంది ఆలేటి భిక్షపతి పాఠశాల ప్రహరీ వద్ద చెత్తను నివారించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ఆ ప్రదేశాన్ని మొత్తం శుభ్ర పరిచి టెంట్ ఏర్పాటు చేశారు. టెంట్‌కు ఇరువైపులా ఇక్కడ చెత్త వేస్తే రూ.1000 జరిమానా అంటూ హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కట్టుబడి ఉండాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ సూచించారు. సోమవారం ఆయన టోలిచౌకి మెరాజ్ కాలనీలోని కార్యాలయంలో బల్దియా వార్డు కార్యాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బల్దియా ఆఫీసుకు వెళితే అక్కడ అధికారులు అందుబాటులో ఉండడం లేదని తనకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఫీల్డ్ మీద ఉన్నామంటూ చెబుతున్న వారు తమ పద్ధతి మార్చుకోవాలన్నారు. అనంతరం ఆయన షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. చెక్కులు రాని వారు వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయన వెంట మజ్లిస్ నాయకులు వజీఉజ్జమా, ఆలీముద్దీన్ తదితరులున్నారు.

ఇంటిగ్రేటెడ్ ఇంకెన్నాళ్లు..?

మార్కెట్ నిర్మాణానికి రూ.4.50 కోట్ల నిధుల కేటాయింపు


పిల్లర్ల దశలోనే ఉన్న మార్కెట్ భవనం పనులు

- మూడేళ్ల క్రితం పనులకు శంకుస్థాపన
- నేటికీ పిల్లర్ల దశలోనే..

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులకు గ్రహణం పట్టింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కూరగాయలు, పండ్లు, మాంసం విక్రయాలను ఒకేచోట అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో 2022 సంవత్సరంలో సమీకృత మార్కెట్ పనులకు శంకుస్థాపన చేయగా, నేటికీ పిల్లర్ల దశలోనే దర్శనమిస్తున్నాయి. దీంతో సరైన మార్కెట్ లేక ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

రూ.4.50 కోట్ల నిధుల కేటాయింపు

కార్పొరేషన్ ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రధాన జాతీయ రహదారికి అనుకొని ఉన్న పీరంచెరువు ప్రాంతం సర్వే నంబర్ 33 లోని 1.33 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఎంపిక చేశారు. రూ. 4.50 కోట్ల నిధులతో వెజ్, నాన్‌వెజ్ అన్నీ ఒకే చోట లభ్యమయ్యేలా అధునాతన మార్కెట్ నిర్మాణానికి మూడేళ్ల కిత్రం ప్రారంభోత్సవం చేసినా ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు.

వారాంతపు సంతలతో సమస్యలు..

కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్, హైదర్షాకోట్, దర్గా ఖలీజ్ ఖాన్, గంధంగూడ, బండ్లగూడ, భైరాగిగూడ, పీరంచెరువు, హిమాయత్‌సాగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపైనే వారాంతపు సంతలు నిర్వహిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పూర్తయితే వ్యాపారుల సౌకర్యంతో పాటు ప్రజలకు నాణ్యమైన మాంసం, కూరగాయలు ఒకే చోట అందుతాయని కొనుగోలుదారులు అభిప్రాయపడుతున్నారు.

మొత్తం 81 స్టాళ్ల నిర్మాణం..

కార్పొరేషన్ పరిధిలో 200 పైగా కాలనీలు ఏర్పడగా, 35,974 నివాస గృహాలు ఉన్నాయి. సుమారు 1.80 లక్షల మంది జనాభా నివాసముంటున్నట్లు అంచనా. దీనికనుగుణంగా 1.33 ఎకరాల స్థలంలో మొత్తం 81 స్టాళ్లు నిర్మిస్తున్నారు. ఇందులో వెజ్ విక్రయించేందుకు 40 స్టాళ్లు, నాన్‌వెజ్ కోసం 26 స్టాళ్లు, పండ్లు, పూలు తదితర అవసరాల కోసం 15 స్టాళ్లు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని కార్పొరేషన్ ప్రజలు కోరుతున్నారు.

కష్టపడిన వారికే గుర్తింపు, ప్రాధాన్యత


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు, ప్రాధాన్యత లభిస్తుందని జాతీయ కిసాన్ మోర్చా అధ్యక్షుడు పాపయ్యగౌడ్, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని పార్టీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు అడికే జనార్దన్ ఆధ్వర్యంలో సోమవారం సంఘటన సంరచన పార్టీ సంస్థగత నిర్మాణం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా వారు హాజరై మాట్లాడారు. అందరిని కలుపుకుని, అందుబాటులో ఉండే వ్యక్తికి, సమయం ఇచ్చే వ్యక్తికి పార్టీ పదవులు ఇస్తుందన్నారు. ఆశావహుల పేర్లు, వివరాలు సేకరించామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మల్లేశ్ యాదవ్, జోగి రవి, రావుల భాస్కర్, సంతుగౌడ్, మురళీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నెల్లుట్ల జగన్, శ్రీకాంత్‌రెడ్డి, పాండుయాదవ్, వెంకటరమణగుప్తా, బబ్లు, మన్మోహన్‌రెడ్డి, అడికే రాజు, ఎన్ను శంకర్‌రెడ్డి, కె.బాబు, వినయ్‌రెడ్డి, ఎండ్లకాడి రవి, మజూరుద్దీన్, ప్రభుదాస్, రామారావు, శేఖర్, బండి నారోత్తం రెడ్డి, సచిన్ షిండే, జి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు పునర్వైభవం తీసుకువస్తాం

చందానగర్: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చెరువులను పునరుద్ధరించి పునర్వైభవం తీసుకువస్తామని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. నెక్సస్ సెలెక్ట్ మాల్స్ సంస్థ వారు సీఎస్ఆర్ ఫండ్స్‌తో మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కాయిదమ్మకుంట చెరువు సుందరీకరణ, పునరుద్ధరణ పనులను అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెరువులో మురుగు నీరు కలవకుండా ఇరిగేషన్ అధికారులు గతంలో యూజీడీ పైప్‌లైన్ చేపట్టారన్నారు. చెరువు కట్ట చుట్టూ మొక్కుంటు పెంచి ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తామన్నారు. పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులో తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ ఐటీ సంస్థ ప్రతినిధులు చైతన్య, రాము, స్థానిక కాంగ్రెస్ నాయకులు గౌతమ్ గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, వెంకటేశ్ గౌడ్, మల్లేశ్ గౌడ్, ప్రవీణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.


కాయిదమ్మకుంట చెరువు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

మణికొండ: మణికొండ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఎన్నికలను సోమవారం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా అల్కాపూర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉప ఎన్నికల అధికారిగా సుమనళిని వ్యవహరించారు. 18 మంది అసోసియేషన్ సంఘం సభ్యులుండగా 15 మంది హాజరయ్యారు. అధ్యక్షుడిగా రాంమోహన్‌రావు, ఉపాధ్యక్షుడిగా నరహరి శాస్త్రి, ముఖ్య కార్యదర్శిగా శ్రీనివాస్‌రావు, ఉప కార్యదర్శిగా రమేశ్, కోశాధికారిగా హరిహరనాథ్‌రెడ్డి, కమిటీ సభ్యులుగా కోదండ రామిరెడ్డి, శ్రీనివాస్‌రావు నామినేషన్ దాఖలు చేశారు. అయితే వారికి పోటీగా నామినేషన్లు రాకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీ కౌన్సిలర్ ఆలస్యం నవీన్‌కుమార్‌ను చీఫ్ ప్యాట్రన్‌గా, ముఖ్య సలహాదారుడిగా అందె లక్ష్మణ్‌రావును నియమించారు. నూతన కమిటీ సభ్యులను గ్రేటర్ అల్కాపూర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘం ఉపాధ్యక్షులు, కోశాధికారిలు అభినందించారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.


నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న సభ్యులు

'బీఆర్ఎస్ హయాంలోనే అరాచక పాలన'

శంషాబాద్: బీఆర్ఎస్ హయాంలోనే రాష్ట్రంలో అరాచక పాలన సాగిందని పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ ఆరోపించారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ సంక్షేమ పాలనపై ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. మహిళలకు ఎంతో ఉపయోగపడుతున్న ఆర్టీసీ ఉచిత బస్సు పథకాన్ని కించపర్చేలా మాట్లాడడం సరికాదన్నారు. దేశ చరిత్రలోనే పేదలకు సన్నబియ్యం ఇస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. ఏడాదిన్నర పాలనలోనే లక్షకు పైచిలుకు ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత కాంగ్రెస్ సర్కారుదేనన్నారు. కుల గణన, ఎస్సీ వర్గీకరణ బీఆర్ఎస్‌కు ఎందుకు సాధ్యం కాలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కారును కించపర్చే అర్హత బీఆర్ఎస్ అధినేతతో పాటు ఎవరికీ లేదని మండిపడ్డారు.

పహల్గాం మృతులకు ఘన నివాళి

శేరిలింగంపల్లి: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ హిందూ జాగృతి ఆధ్వర్యంలో సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. శేరిలింగంపల్లి గోపీనగర్ హనుమాన్ ఆలయం నుంచి భెల్ చౌరస్తా వరకు ర్యాలీ తీసి మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ్ పరివార్ కార్యకర్తలు, వివిధ పార్టీల నేతలు, పతంజలి యోగా సమితి సభ్యులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



'ఈద్ మిలాప్‌లు స్నేహ సంబంధాలను పటిష్టం చేస్తాయి'


ఈద్ మిలాప్‌లో మహ్మద్ నజీబ్ తదితరులు

గోల్కొండ: ఈద్ మిలాప్ లాంటి కార్యక్రమాలు స్నేహ సంబంధాలను పటిష్టం చేస్తాయని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. ఫలక్‌నూమాకు చెందిన మహ్మద్ సైఫ్, జుబేర్ సోమవారం టోలిచౌకీ అక్బర్ బాగ్‌లో ఈద్ మిలాప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహ్మద్ నజీబ్ మాట్లాడుతూ..ఈద్ మిలాప్ కార్యక్రమాలు పాత విషయాలను గుర్తుకు చేసుకోవడం, స్నేహ సంబంధాలు పటిష్టం పరుచుకోవడం కోసం దోమదపడతాయన్నారు. ఇటువంటి కార్యక్రమాలు గతంలో కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, సోసైటీల వారు నిర్వహించుకునే వారు అని అయితే నేడు యువకులు సైతం గ్రూపులుగా ఏర్పడి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హబీబ్ ఆలీఖాన్, మహ్మద్ ఇమ్రాన్, మహ్మద్ సమీర్, మహ్మద్ పహాద్ తదితరులున్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

గోల్కొండ: అక్రమ పార్కింగ్‌లను సహించేది లేదని టోలిచౌకీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.సుధాకర్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్సై మహ్మద్ షఫీ షేక్‌పేట్ పాత ముంబాయి జాతీయ రహదారి, టోలిచౌకీ చౌరస్తా, రుమాన్ హోటల్ తదితర ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్లపై అక్రమంగా పార్కు చేసి ఉన్న వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సుధాకర్ మాట్లాడుతూ..అక్రమ పార్కింగ్‌లు ఎన్నో సమస్యలకు దారి తీస్తున్నాయన్నారు. అక్రమ పార్కింగ్ వల్ల పాత ముంబాయి జాతీయ రహదారి, హకీంపేట్ రోడ్డు, సెవన్ టూంబ్స్ చౌరస్తా, రుమాన్ హోటల్ తదితర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అక్రమ పార్కింగ్‌లకు పాల్పడే వారు ఎంతటి వారైనా వదలకుండా వారి వాహనాలను స్వాధీనం చేసుకుంటామన్నారు.


అక్రమంగా పార్క్ చేసిన వాహనాలను స్వాధీనం చేసుకుంటున్న ట్రాఫిక్ పోలీసులు

విద్యార్థుల చదువుకు సహకారం అందిస్తాం

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థుల చదువుకు సహకారం అందిస్తూ ప్రోత్సహిస్తున్నామని మహవీర్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్ కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. కృష్ణానగర్‌లోని కారుణ్య సింధు బాలుర అనాథాశ్రమంలో నిర్వహిస్తున్న 'మన వారసత్వ సంపద-వ్యక్తి వికాసం' వేసవి శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహవీర్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్ 25 ఏళ్ల ఎక్సలెన్స్ వేడుకల్లో భాగంగా అనాథాశ్రమంలోని విద్యార్థులకు 15 కంప్యూటర్లను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో అనాథాశ్రమం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మహవీర్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్ కార్యదర్శి సురేందర్‌రెడ్డి

ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం


సభ్యులను సన్మానిస్తున్న జగదీశ్వర్ గౌడ్ తదితరులు

శేరిలింగంపల్లి: నల్లగండ్లలోని సోమేశ్వర్ ఆలయ నూతన కమిటీ సోమవారం ప్రమాణ స్వీకారం చేసంది. ఆలయ చైర్మన్‌గా పురం విజేందర్‌రెడ్డి, డైరెక్టర్స్‌గా శోభ, పి.లక్ష్మీనారాయణ, ఎం.శ్రీనివాస్, డి.దయానంద, పి.రమేశ్‌యాదవ్, టి.శివకుమార్ గౌడ్, ప్రధాన అర్చకులుగా సంగమేశ్వర్ ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్ గౌడ్ హాజరై నూతన కమిటీ సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాటాడుతూ.. ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని, నీటి సదుపాయం, ఇతర పనులపై శ్రద్ధ పెట్టాలని కమిటీ సభ్యులకు సూచించారు. నాయకు లు దశరథ్, దయాకర్ యాదవ్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, యాదగిరి, మల్లేశ్, కుమార్, విష్ణువర్ధన్ రెడ్డి, నర్సింహారెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

మేడే పోస్టర్ ఆవిష్కరణ

గచ్చిబౌలి: సీఐటీయూ మేడే పోస్టర్‌ను గచ్చిబౌలి కూడలిలోని ఆటోస్టాండ్ వద్ద నాయకులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి సీఐటీయూ కార్యదర్శి కొంగరికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్ మాట్లాడుతూ.. కార్మికులకు 8 గంటల పనిదినం ఉండాలని చికాగో నగరంలో 1889 మే 1 న జరిగిన కార్మిక వర్గ పోరాటంలో ఎంతోమంది ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. వారి ప్రాణత్యాగాలను స్మరిస్తూ మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాలు సాంబవీరేష్, సంతోష్ ఆటో కార్మికులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉంటేనే సమస్యల పరిష్కారం

మణికొండ: కార్మికులంతా ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని సీఐటీయూ మండల కన్వీనర్ డప్పు ప్రవీణ్‌కుమార్ అన్నారు. వచ్చే నెల 20న చేపట్టనున్న సమ్మె నోటీసును మణికొండ మున్సిపాలిటీ కమిషనర్ ప్రదీప్‌కుమార్‌కు సోమవారం అందజేశారు. అలాగే మే డే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మే 1న జరిగే 139వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పండుగల కాకుండా దీక్ష దినంగా జరపాలన్నారు. కార్మిక వర్గ ప్రతిఘటన వల్లే 8 గంటల పని దినం చట్టం చేయబడిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్, నాయకులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్మికులు

కేంద్రీయ విద్యాలయంలో ప్రాంతీయ స్పోర్ట్స్ మీట్

గోల్కొండ: నానల్‌నగర్‌లోని కేంద్రీయ విద్యాలయం నెంబర్ వన్ గోల్కొండలో సోమవారం 54వ ప్రధానమంత్రి కేంద్రీయ విద్యాలయ స్పోర్ట్స్ మీట్ ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలను బ్రిగేడియల్ రాహుల్ థాప్లియాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేవీఎస్-1 విద్యార్థులు ప్రదర్శించిన మంకీ వీనాసే గుంజిత్ ద్వాని మంగళం అనే స్వాగత గీతంతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం ఆయన మార్చ్ ఫాస్ట్ తిలకించి కేంద్రీయ విద్యాలయాలు క్రమశిక్షణ, ఐక్యతకు నిదర్శనం అని అన్నారు. జాతీయ అథ్లెట్‌లు ఆవుల సాయిప్రశాంత్, సహస్రారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్, ఆకాష్‌గేరా పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఫౌంటెన్‌కు మరమ్మతులు

2023లో రూ.29.50 లక్షల నిధులతో ఆధునీకరణ

- ఆరు నెలలకే పర్యవేక్షణ లోపం
- ఫౌంటెన్ చుట్టూ పగిలిపోయిన గ్రానైట్ రాళ్లకు మరమ్మతులు
- ఇకనైనా శాశ్వత ప్రాతిపదికన జరుగుతాయా..? లేక తూతూమంత్రమేనా..?



చార్మినార్: గుల్జార్‌హౌజ్ ఫౌంటెన్‌కు ఎట్టకేలకు మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఫౌంటెన్ చుట్టూ ఏర్పాటు చేసిన గ్రానైట్ ఫుట్‌పాత్ రాళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మరమ్మతులు చేయించడానికి సంబంధిత అధికారుల వద్ద సమయం లేకపోవడంతో ఇప్పటి వరకు నిర్లక్ష్యానికి గురైంది. 2023లో రూ.29.50 లక్షల నిధులతో ఆధునీకరించబడి అందుబాటులోకి వచ్చింది. రెనోవేషన్ పూర్తయిన ఆరు నెలలకే తిరిగి అధికారుల నిర్లక్ష్యానికి గురైంది. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో లక్షలాది రూపాయల నిధులు నిరుపయోగంగా మారే పరిస్థితులు ఎదురయ్యాయి. రాత్రిపూట ఆకట్టుకునే రంగు రంగుల విద్యుత్ దీపాల నడుమ నీరు విరజిమ్మే ప్రక్రియ కొద్ది రోజులు నిలిచి పోయింది. ఎలాగో అలాగా తిరిగి మరమ్మతులకు నోచుకోవడంతో కొద్ది రోజులు పని చేసింది. అయితే ఫౌంటెన్ చుట్టూ రోడ్డుపై ఏర్పాటు చేసి గ్రానైట్ రాళ్లు పగిలిపోయాయి. వీటి మరమ్మతులను వెంటనే చేపట్టకపోవడంతో అటువైపు నుంచి రాకపోకలు సాగించే వారికి అంధవికారంగా కనిపించింది. ఈ విషయాన్ని అప్పట్లో అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఫౌంటేన్ అంటూ 'సాక్షి' కథనం కూడా రాసింది. అయినా సంబంధిత అధికారుల్లో ఎలాంటి చలనం కనిపించ లేదు. ఎట్టకేలకు గ్రానైట్ రాళ్ల మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఇవి కూడా శాశ్వత పరిష్కారంగా ఉంటాయా..లేక తూతూ మంత్రంగా ఉంటుందా..? వేచి చూడాలి.

2016లో కూడా..

2016లో ఫౌంటెన్ మరమ్మతుల కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించడంతో అప్పట్లో కూడా మరమ్మతు పనులు చేయించారు. అంతేకాకుండా గతంలో జరిగిన బయోడైవర్సిటీ సమావేశాల సందర్భంగా గుల్జార్‌హౌజ్ ఫౌంటెన్‌కు మరమ్మతులు నిర్వహించి అందుబాటులోకి తెచ్చారు. తదనంతరం మళ్లీ ఏడాదికి శిథిలావస్థకు చేరుకోవడం..మళ్లీ మరమ్మతులు చేయడం పరిపాటిగా మారింది. అయితే మరమ్మతు పనుల అనంతరం ఫౌంటెన్‌ను నిరంతరం పర్యవేక్షించాల్సిన సిబ్బంది పట్టించుకోకపోవడంతో పనికి రాకుండా పోయింది. ఫౌంటెన్‌లో చెత్తాచెదారం పేరుకుపోయింది. పేరుకుపోయిన చెత్తాచెదారంతో ఫౌంటెన్ కళాహీనంగా మారింది. దీంతో గత ప్రభుత్వ హయాంలో గుల్జార్‌హౌజ్ ఫౌంటెన్ సుందరీకరణ కోసం రూ. 29.50 లక్షలను కేటాయించి నిరంతర పర్యవేక్షణను కులీకుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి అప్పగించింది.

నిరంతర పర్యవేక్షణ అవసరం..

గుల్జార్‌హౌజ్ ఫౌంటెన్‌కు ఉన్న ప్రాధాన్యత నేపథ్యంలో మరమ్మతులు చేసిన అనంతరం సంబంధిత అధికారులు, సిబ్బంది నిరంతర పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది. సిబ్బంది నిరంతర పర్యవేక్షణ ఉంటే మళ్లీ మళ్లీ మరమ్మతులు చేయాల్సిన అవసరం రాదని పాతబస్తీ ప్రజలు అంటున్నారు. మరమ్మతుల పేరుతో ప్రభుత్వ ధనం దుర్వినియోగం అవుతుందంటున్నారు. ఇప్పటికైనా గుల్జార్‌హౌజ్ ఫౌంటెన్‌కు శాశ్వతంగా పూర్తిస్థాయి మరమ్మతులు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అవసరముందని పర్యాటకులు అంటున్నారు.